క్లుప్తంగా

శ్రీరామనవమికి రాట ముహూర్తం

బిక్కవోలు: మండలంలోని పందలపాక వెలంపేట వద్ద ఉన్న కోదండ రామాలయం వద్ద శ్రీరామనవమి పనుల ప్రారంభానికి రాట ముహూర్తం సోమవారం నిర్వహించారు. ఈ నెల 17న శ్రీరామనవమి కోసం ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చీపురపల్లి ఆనందరావు, వైకుంఠ వెంకటేశ్వరరావు, గండి రఘు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



బిక్కవోలులో రాజీనామా చేసిన వలంటీర్లు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు, బలభద్రపురం, పందలపాక తదితర గ్రామాలకు చెందిన వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను స్థానిక పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాజీనామా చేసినట్లుగా చెప్పారు.

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ సచివాలయం-3 పరిధిలో పనిచేస్తున్న 19 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శి యశ్వంత్ కుమార్‌కు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు సేవ చేసేందుకు ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థను చంద్రబాబు అపహాస్యం చేశారని, రానున్న ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెబుతామన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

రాజానగరం: నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యతో ఏ ఒక్కరూ బాధపడకూడదనే సంకల్పంతో ప్రభుత్వ సహకారంతో మండల కేంద్రంలో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం) ఏర్పాటు చేయనున్నారు. పదో తరగతి పైబడి చదువుకుని, ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చి, ఆయా రంగాలలో వారికి స్వయం ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రాజానగరంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న కామన్ ప్రొడక్షన్ సెంటర్‌ని స్వయం ఉపాధికి శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంప్యూటర్, టైలరింగ్, అల్లికలలో ఇప్పటికే 16 బ్యాచ్‌లలో 400 మందికి శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం 17వ బ్యాచ్ శిక్షణ జరుగుతుంది.

ఆర్టిస్టు రామ్మోహన్‌కు సత్కారం

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడికి చెందిన కన్నాబత్తుల రామ్మోహన్ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని గీసినందుకు ఆదివారం విజయవాడలో సత్కరించినట్టు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం విజయవాడలో చిత్రకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొనగా తనకు సత్కారం అందినట్టు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

రాజానగరం: చక్రద్వారబంధంలో నూతనంగా నిర్మించిన వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో వాసవీ మాతతోపాటు వినాయకుడు, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను కూడా ప్రతిష్ఠించారు. గాది సూరిబాబు దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు భవానీభట్ల సుబ్రహ్మణ్యశర్మ, పెద్దాడ దుర్గయ్యశాస్త్రిల పర్యవేక్షణలో ప్రతిష్ఠోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

వాటర్ కూలర్ బహూకరణ



వాటర్ కూలర్‌ను అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల పాఠశాలకు ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం వాటర్‌కూలర్‌ను బహూకరించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సంఘం రీజనల్ మేనేజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరుళ్ల రాజేష్ చేతుల మీదుగా స్కూల్ హెచ్‌ఎం నిర్మల జ్యోతికుమారికి అందజేశారు. కార్యక్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

సీతానగరం: సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీలో కోదండ రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, భక్తాంజనేయ స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. మూడు రోజులపాటు హోమాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు.

ముమ్మరంగా వరి కోతలు

- కూలీల కొరతతో యంత్రాలపైనే ఆధారం
- ఆశాజనకంగా రబీ దిగుబడి



ఊలపల్లిలో యంత్రాలతో వరి కోతలు

బిక్కవోలు: గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలి రేట్లు పెరగడంతో పాటు కూలీల కొరత వేధిస్తుండటంతో 90 శాతం మంది రైతులు యంత్రాలతోనే కోతలు చేయిస్తున్నారు. తక్కువ ఖర్చుతో గంటల వ్యవధిలోనే ధాన్యం చేతికి అంది వస్తుండటంతో యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. కూలీలతో కోయిస్తే రెండు మూడు రోజులు పనలపై ఆరబెట్టాల్సి ఉంటుంది. ఆ సమయంలో వర్షం కురిస్తే పంటకు ముప్పు తప్పదని యంత్రాలతోనే కోతలు పూర్తి చేసి పొలంలోనే ధాన్యం విక్రయిస్తున్నారు. పది శాతం రైతులు మాత్రం పశుగ్రాసంగా ఎండు గడ్డిని ఉపయోగించుకునేందుకు కూలీలతో కోతలు కోయిస్తున్నారు.

అనుకూలించిన వాతావరణం

అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో సుమారు 48 వేల ఎకరాల్లో రబీ సాగు చేశారు. ఇప్పటికే 10 శాతం పంట కోతలు పూర్తయ్యాయి. మరో 15 రోజులు వర్షాలు రాకుండా ఉంటే ఈ ఏడాది పంట పూర్తి స్థాయిలో చేతికందుతుందని రైతులు చెబుతున్నారు. రబీ సాగులో ఈ ఏడాది వాతావరణం బాగా అనుకూలించింది. గతంలో అకాల వర్షాలు, సుడిదోమ, దోమపోటుతో పంట నష్టం వచ్చేది. ఈ ఏడాది అంతా సజావుగా సాగింది. దిగుబడులు సైతం గతం కంటే బాగున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 40 నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి వస్తోందంటున్నారు.

అపరాల సాగుకు మాత్రం ఇబ్బందే

రబీ పంట తరువాత రైతులు ఖరీఫ్ సాగుకు ముందు అపరాల పంటలు వేస్తుంటారు. ప్రస్తుతం రబీలో పంటను యంత్రాల ద్వారా కోతలు కోయిస్తుండటంతో గడ్డంతా పొలాల్లోనే ఉండిపోతోంది. దీని వల్ల అపరాల విత్తనాలు చల్లినా విత్తనాలు పాడై మొలకలు రావడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో చాలా మంది రైతులు అపరాల సాగుకు దూరంగా ఉంటున్నారు. కొంత మంది రైతులు మాత్రం చేలల్లోని గడ్డిని తొలగించి పచ్చిరొట్ట విత్తనాలు, ఇతర అపరాల పంటలు వేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

పంట బాగా పండింది



ఈ ఏడాది పంట బాగా పండింది. అయితే కోతలు పూర్తయ్యే వరకూ వరుణుడు కరుణించాలి. కోతలు కోసి, ధాన్యం విక్రయించే వరకూ వర్షాలు రాకుండా ఉంటే పంట పూర్తి స్థాయిలో చేతికందుతుంది. కూలీల కొరత కారణంగా యంత్రాలతోనే కోతలు పూర్తి చేస్తున్నాం.

– సత్యంశెట్టి రమేష్, రైతు, బలభద్రపురం

ఆర్బీకేలతో ఎంతో మేలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా రైతులకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడింది. ప్రధానంగా ఆర్బీకేలను ఏర్పాటుచేసి రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు సకల సేవలు అందిస్తున్నారు. ఆర్బీకేలతో రైతులకు ఎంతో మేలు జరిగింది.

– గొలుగూరి ఈశ్వర్‌రెడ్డి, రైతు, పందలపాక

అపరాలు సాగు చేయండి



యంత్రాలతో కోతలు కోసినా అపరాలు సాగు చేయవచ్చు. కోత కోసే ముందు రోజునే అపరాల విత్తనాలు చల్లుకోవాలి. యంత్రాలతో కోతలు కోయించిన రైతులు అపరాలు సాగు చేయకపోతే అక్కడ ఉన్న గడ్డి పొలమంతా సర్దితే తేమ వల్ల భూసారం పెరుగుతుంది.

– శామ్యూల్ జాన్, మండల వ్యవసాయాధికారి, బిక్కవోలు

మద్యం, నగదు అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి



రామేశ్వరంపేట చెక్‌పోస్టులో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ విజయ

రంగంపేట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణా జరగకుండా పగడ్బందీగా అడ్డుకట్ట వేయాలని ఏపీఎస్‌ఈబీ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో మంగళగిరి అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ సూచించారు. సోమవారం రంగంపేట ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలోని రామేశ్వరంపేట వద్ద ఏడీబీ రోడ్డులో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకూ చెక్ పోస్టు పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. తనిఖీల్లో రంగంపేట ఎస్‌ఈబీ సీఐ ఎస్.రాంబాబు, పెద్దాపురం ఎస్‌ఈబీ సీఐ సుబ్రహ్మణ్యం, రాజమహేంద్రవరం టాస్క్‌ఫోర్స్ సీఐ టి.గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అట్టలు, పెన్నుల పంపిణీ

సీతానగరం: ముగ్గళ్ల ఎంపీపీ స్కూల్ విద్యార్థులకు ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. సోమవారం 60 మంది విద్యార్థులకు ఆమె తండ్రి మాగాపు సుధాకరరావు జ్ఞాపకార్థంగా అట్టలు, పెన్నులు, స్కెచ్ పెన్నులను అందించారు.

వైఎస్సార్ సీపీకే ప్రజల ఓట్లు

- అధికారంలోకి వచ్చేది జగనన్నే..!
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం
- ఎమ్మెల్యే అభ్యర్థి రాజా, ఎంపీ అభ్యర్థి గూడూరి, ఎమ్మెల్సీ శ్రీనివాస్ ప్రచారం



ఎన్నికల ప్రచారం కోసం పురుషోత్తపట్నం నుంచి రామచంద్రపురం వస్తున్న పార్టీ శ్రేణులు



వంగలపూడిలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రజల కోసం పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ఓట్లు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అధికారంలోకి వచ్చేది జగనన్నే అని తూర్పుగోదావరి జిల్లా పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. సోమవారం మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, సీతానగరంలో ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గడచిన ఐదేళ్లల్లో సీతానగరం మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలతోపాటు అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గం పరిధిలో లక్ష కుటుంబాలు ఉంటే 75 వేల కుటుంబాలు నేరుగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా అడుగులు వేశామన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు మాత్రమే తమ లక్ష్యం కాదని 45 వేల ఓట్లు మెజార్టీతో గెలుపే తమ లక్ష్యమన్నారు.ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కి, మరో ఓటు నా కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నియోజకవర్గంను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, ఎస్ ఎంపీపీప సురేష్‌బాబు, మదన్‌బాబు, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, సర్పంచులు కొంచ అన్నపూర్ణ, కోండ్రపు ముత్యాలు, ఎంపీటీసీలు సూరెడ్డి గంగా భవాన్ని, వెన్నెల అప్పలనాయుడు, కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, చల్లమళ్ళ సుజీరాజు, మెహర్‌బాబా, శరత్, గద్దె వీరన్నబాబు, వలవల వల్లీ, వలవల సత్తిబాబు, చిర్ల పోశియ్య, మట్ట శ్రీనివాస్, జిల్లా ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం జగన్‌తోనే సాధ్యం



లక్ష్మీనరసాపురంలోని అమ్మిరెడ్డి ఆయిల్స్ ఫ్యాక్టరీలో కార్మికుల మద్దతు కోరుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- దుప్పలపూడిలో ఎన్నికల ప్రచారం

అనపర్తి: పేదల సంక్షేమం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆయన మండలంలోని దుప్పలపూడి, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల పరిధిలో వివిధ కర్మాగారాలు, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులను కలుసుకుని మద్దతు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు బాసటగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ మద్దతును అందించాలన్నారు. అవినీతి రహితంగా పారదర్శక పాలన అందించి, అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు ప్రజలు మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే సంక్షేమం సాధ్యం

- ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి
- కొంకుదురులో ఎన్నికల ప్రచారం



కొంకుదురులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

బిక్కవోలు: వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని కొంకుదురులో ఆమె ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. గడప గడపలో మహిళలు ఆమెకు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు మేలు జరిగిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టి గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, జిల్లా మహిళ సంక్షేమ స్థాయి సంఘం చైర్‌పర్సన్ రొంగల పద్మావతి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎంపీటీసీలు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, చిన్నం శ్రీనివాస్‌రెడ్డి, నేకూరి రాజాపాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అనపర్తిలో అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను పంచుతున్న అగ్నిమాపక సిబ్బంది

అనపర్తి: అగ్నిప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అనపర్తి అగ్నిమాపక అధికారి జె.శ్రీనివాసరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్థానిక దేవీచౌక్, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో గ్యాస్ ప్రమాదాలు సంభవించే తీరు, మంటలను అదుపుచేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు.

జగన్‌తోనే పారదర్శక పాలన



చినకొండేపూడిలో వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- చినకొండేపూడిలో 50 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పారదర్శక పాలన సాధ్యమవుతుంది ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తెలిపారు. సోమవారం చినకొండేపూడి వైఎస్సార్ సీపీ నాయకులు పోలినాటి ఈశ్వరుడు నివాసం వద్ద కోటి సూరిబాబు, కోనే శ్రీను(టైగర్), ఉక్కంపేట పోశియ్య, శెట్టి అబ్బులు, మేడిశెట్టి త్రిమూర్తులు, మేడిశెట్టి సత్యనారాయణ, రావూరి డాక్టర్‌బాబు, కోటి రామకృష్ణ, పరటాల శ్రీను, వాకపల్లి వెంకటేశులు, జెనుల సత్తిబాబు, రాంబాబు, లక్కిశెట్టి సత్యనారాయణ తదితరులతోపాటు 50 మందికి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జక్కంపూడ రాజా మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన నియోజకవర్గానికి ఎన్నడు లేని విధంగా అభివృద్ధిచేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే పారదర్శక పాలన అందించారని అన్నారు. సీతానగరం మండలంలో పలు అభివృద్ధి పనులు చేశామని, అందులో భాగంగా కాతేరు – సీతానగరం వరకు ఆర్అండ్‌బీ రోడ్డును నాలుగు లైన్ల రోడ్డు పూర్తికావచ్చిందన్నారు. సీతానగరం పీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేసి 30 పడకల ఆసుపత్రిగా రఘుదేవపురంలో పనులు జరుగుతున్నాయని గుర్తు చేశారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా జగనన్న, నియోజకవర్గంలో ఎమ్మెల్యే తనను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌లు అత్యధిక మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, వైస్‌ఎంపీపీలు ముదునూరి సురేష్‌బాబు, సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సత్తిపండురాజు, పోలినాటి రామచంద్రరావు, ముదునూరి రామకృష్ణరాజు, మేడిశెట్టి చిన్నికృష్ణ, కోనే శ్రీను (ఇంద్ర), యర్రంశెట్టి బాబులు పాల్గొన్నారు.

అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరుపై పీఓలు, ఏపీఓలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓ ఎం.మాధురి


అనపర్తి: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ఎన్నికలు అత్యంత పగడ్బందీగా, సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) ఎం.మాధురి సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సోమవారం ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ మాట్లాడుతూ వచ్చే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమావళిని పకడ్బందీగా అమలు చేయడంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎటువంటి ఆరోపణలకు, అవకతవకలకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా సాగేందుకు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా పీఓలు, ఏపీఓలకు ఎన్నికల్లో వినినియోగించే ఈవీఎంలు, వీవీప్యాట్‌లపై అవగాహనను ఆమె స్వయంగా పరిశీలించారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం చేపట్టాల్సిన బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం మాస్టర్ ట్రైనీల ఆధ్వర్యంలో ఈవీఎం, వీవీప్యాట్‌ల నిర్వహణ, పనితీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పీఓలు, ఏపీఓలకు వివరించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓ, తహసీల్దార్ సునీల్‌బాబు పాల్గొన్నారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా పడాల వెంకటరెడ్డి

అనపర్తి: శ్రీఅయ్యప్ప నేషనల్ లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పడాల వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా చింతా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఉమ్మిడి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా బండారు శ్రీనివాసరావు, కోశాధికారిగా గంధం వెంకటసత్యనారాయణ, కమిటీ సభ్యులుగా ఎస్.సత్యనారాయణ, బి.ప్రసాద్, బివివి సత్యనారాయణమూర్తి, పి.ప్రసాద్, జి.అప్పారావు, ఎ.గంగరాజు, కె.చంద్రశేఖర్, బి.శ్రీనివాస్, ఎం.సురేష్‌కుమార్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నికల నిర్వహణలో సిబ్బందిదే కీలక పాత్ర

- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చైత్రవర్షిణి
- పీఓ, ఏపీఓలకు ఒక రోజు శిక్షణ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చైత్రవర్షిణి

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించుటలో ఎన్నికల సిబ్బందిదే కీలక పాత్ర అని రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి అన్నారు. మండలంలోని పాలచర్ల, బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సోమవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలలో కేటాయించిన విధులను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ రోజుతో పాటు ముందు, వెనుక రోజుల్లో నిర్వహించాల్సిన బాధ్యతలపై మాస్టర్ ట్రైనీల ద్వారా అవగాహన కలిగించారు. ఓటర్లపై దురుసుగా కాకుండా సానుకూలత, సామరస్యంగా వ్యవహరించాలన్నారు. వాదనలకు తావివ్వకుండా ఎన్నికల నిబంధనలను అనుసరించి విధులు నిర్వర్తించాలని, సమస్యలొస్తే వెంటనే పై అధికారులకు తెలియజేయాలి గానీ వాదోపవాదాలకు దిగరాదన్నారు. శిక్షణ అనంతరం పోస్టల్ బ్యాలెట్ నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎఎల్‌ఎంటీలు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

దుప్పలపూడి సర్పంచ్ పదవి నుంచి తొలగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

అనపర్తి: గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడారన్న కారణంతో మండలంలోని దుప్పలపూడి సర్పంచ్ నల్లమిల్లి సావిత్రిని పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు డీపీఓ డి.రాంబాబు తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఉత్తర్వులు జారీ చేశారని ఆయన తెలిపారు. దుప్పలపూడి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో గతేడాది సెప్టెంబరు నెలలో విచారణ చేపట్టిన బిక్కవోలు ఈఓపీఆర్డీ పంచాయతీ నిధులు రూ.40,50,374 దుర్వినియోగమైనట్లు నివేదిక సమర్పించారు. దీనిపై సర్పంచ్‌ను సంజాయిషీ కోరిన జిల్లా కలెక్టర్ ఎందుకు సర్పంచ్ పదవి నుంచి తొలగించకూడదంటూ షోకాజ్ నోటీసు జారీ చేసారు. అనంతరం నిధుల దుర్వినియోగంపై పూర్తి స్థాయి విచారణ జరిగే వరకు సర్పంచ్ నల్లమిల్లి సావిత్రిని మూడు నెలలపాటు (27-01-2024 నుండి 27-04-2024) వరకూ తాత్కాలికంగా సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. దీనిపై సర్పంచ్ కోర్టును ఆశ్రయించడంతో నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై కలెక్టర్‌కు పూర్తి వివరణ ఇచ్చేందుకు గాను సర్పంచ్‌కు కొంత సమయం, గడువు ఇస్తూ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో సర్పంచ్ గత నెల 27న కలెక్టర్ ముందు హాజరై వివరణ ఇచ్చారు. అయితే సర్పంచ్ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో 249(బీ) ఏపీపీఆర్ యాక్ట్ ప్రకారం నల్లమిల్లి సావిత్రిని సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.